

పోటెత్తిన భక్తులు

కొండగట్టు: శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం హైకోర్టు జడ్జి జస్టిస్ కార్తీక్ పూజలు చేశారు. భక్తుల రద్దీ పెరిగింది.



వంజరి కులస్తుల సమావేశం

మెట్‌పలి: వంజరి కులస్తులు మంగళవారం రాజేశ్వర్‌రావుపేటలో సమావేశమయ్యారు. అన్నిరంగాల్లో రాణించాలని తీర్మానించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0/15.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కుజదోష నివారణ పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల మంత్రోచ్చారణలతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ పూజలు చేస్తే కుటుంబ కలహాలు, వాస్తుదోశాలు, ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని అర్చకులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన, అనుబంధ దేవాలయాల్లో మొక్కులు చెల్లించారు.

టీచర్లకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: జీవో నంబరు 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్ కోరారు. ఈమేరకు మంగళవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల్లో అవకతవకలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

జగిత్యాలజోన్: జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు 2002 ఏప్రిల్ నుంచి పీఆర్సీ రాలేదన్నారు. ఈవిషయంపై పలుమార్లు యాజమాన్యానికి విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. డివిజన్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, సెక్రటరీ రమణ, డివిజన్ అధ్యక్షుడు కొమురయ్య, నాయకులు కుమార్, మహేశ్, రాకేశ్, గగన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వలలో చిక్కిన మొసలిపిల్ల



వలలో చిక్కిన మొసలిపిల్ల

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కంచెరికుంటలో మంగళవారం మత్స్యకారుల వలలో మొసలిపిల్ల చిక్కింది. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ఎల్ల అశోక్ నీటిలోంచి వలను బయటకు తీయగా మొసలిపిల్ల కనిపించింది. వెంటనే ఒడ్డుకు తీసుకొచ్చి చూడగా అది మృతిచెంది కనిపించింది. ఈ విషయాన్ని అటవీశాఖ బీట్ ఆఫీసర్ రత్నాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఘటన స్థలానికి చేరుకుని కళేబరాన్ని పశువైద్యశాలకు తరలించారు. పంచనామా చేశాక దహనం చేశారు. సుమారు ఆరు కేజీల బరువున్న మొసలిపిల్ల వయసు దాదాపు ఏడాది ఉంటుందని బీట్ ఆఫీసర్ తెలిపారు. కంచెరికుంటలో మొసలిపిల్ల లభ్యం కావడంతో ఇంకా ఏమైనా ఉన్నాయా? అని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో స్వీపర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, అటెండర్ నియామకం కోసం హైదరాబాద్‌లోని ధర్మాదాయ, దేవాదాయ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ– ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిన నోటిఫికేషన్ జారీచేసిన అధికారులు.. అర్హులకే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. అయితే, కొందరు పొరవీకారులు ఉద్యోగాల కోసం ఇప్పటికే పైరవీలు సాగిస్తున్నారని సమాచారం.

కార్యదర్శి రాజీనామా

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఎర్రాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత మంగళవారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో ప్రభకు అందజేశారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కవిత.. వివిధ ఉద్యోగాల కోసం జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈమేరకు కార్యదర్శి ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు ఆమె మంగళవారం వెల్లడించారు.

గిరిజనుల్లో ‘సర్వే’ ఆశలు!



అభివృద్ధి పనుల కోసం సర్వే చేసిన కథలాపూర్ మండలంలోని రాజారం తండా

- తండాల్లో వసతుల కల్పన ధ్యేయం
- ఇంటింటికీ మిషన్ భగీరథ తాగునీరు
- ప్రతీ గిరిగ్రామానికి తారురోడ్డు నిర్మాణం
- ఆరోగ్య ఉప కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- తొలివిడతలో 38 గూడేల్లో సర్వే పూర్తి
- ప్రభుత్వానికి నివేదించిన అధికారులు
- నిధులు మంజూరైతేనే పట్టాలపైకి పనులు!

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో గ్రామాలకు దూరంగా, మారుమూలన ఉన్న గిరిజన తండాలు, కొత్త గిరిజన గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా గిరిజన తండాల్లో అందుబాటులో ఉన్న వనరులు, చేయాల్సిన పనులు గుర్తించడానికి ఇటీవల వారంపాటు ఇంజినీరింగ్, గిరిజన సంక్షేమశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. ఈప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. అధికారులు గుర్తించిన పనులను ప్రభుత్వానికి నివేదించారు. త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతారని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తొలివిడత 38 తండాల్లో సర్వే..

- జిల్లాలో తొలివిడతలో 38 తండాల్లో ఇంజినీరింగ్, గిరిజన సంక్షేమశాఖ అధికారులు సర్వే చేశారు.
- ఆయా తండాలు, గిరిజన గూడేలు, కొత్త గ్రామపంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు గుర్తించారు.

అధికారులు సర్వే చేసిన తండాల వివరాలు

నియోజకవర్గం	తండాలు
చొప్పదండి	1
ధర్మపురి	7
జగిత్యాల	18
కోరుట్ల	8
వేములవాడ	4

సర్వేలో గుర్తించిన అంశాలు ఇవే..

- జిల్లాలో తొలివిడత చేసిన సర్వేలో 38 తండాల్లో 53 కి.మీ. పొడవున తారు రోడ్డు నిర్మించాలని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.
- మిషన్ భగీరథ పథకం ద్వారా అన్నితండాల్లో పైప్‌లైన్ నిర్మించాలని నిర్ణయించారు.
- అయితే, తండాల్లో విద్యుత్ సౌకర్యం ఇప్పటికే ఉందని గుర్తించారు.
- తొమ్మిది తండాల్లోని ప్రాథమిక పాఠశాలలకు సొంత భవనాలు లేవని తేల్చారు.
- ఏ గిరిజన తండాలోనూ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు లేవని స్పష్టం చేశారు.
- ఐదు తండాల్లోనే గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయని వెల్లడించారు.
- మూడు తండాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయని నివేదించారు.
- మొబైల్ కనెక్టివిటీ 37 తండాల్లో ఉండగా.. బీర్‌పూర్ మండలంలోని అనుసూర్ తండాలో ఆ సౌకర్యం లేదని గుర్తించారు.
- నాలుగు తండాల్లో అంతర్గత సీసీ రోడ్లు అవసరమని అధికారులు జీపీఎస్ ద్వారా ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి నివేదికలను తయారు చేశారు.
- అధికారులు మరోసారి చర్చించి పనులకు ప్రతిపాదనలు తయారు చేస్తారని సర్వే బృందం వెల్లడించింది.
- ఇదంతా బాగానే ఉన్నా గుర్తించిన పనులకు నిధులు త్వరగా మంజూరు చేయాలని ఆయా తండాల ప్రజలు కోరుతున్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం



బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజన తండాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ సారించడం సంతోషకరం. తండాలను అభివృద్ధి చేయాలనే ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేసి పనులు గుర్తించారు. తొలుత మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించారు. తండాలు అభివృద్ధి చెంది కొత్త కళ సంతరించుకుంటాయి.

– గుగ్లోత్ రవినాయక్, గిరిజన సంఘం అధ్యక్షుడు, కథలాపూర్

సర్వేలకు పరిమితం కావొద్దు



గ్రామాలకు దూరంగా ఉన్నాయని గిరిజన తండాలను అభివృద్ధిలో దూరం చేయవద్దు. అభివృద్ధి పనుల పేరిట ప్రభుత్వం ఆర్భాటం చేసి ఆ తర్వాత విస్మరించవద్దు. ఈసారి గిరిజన తండాల్లో అభివృద్ధి పనులు గుర్తించేందుకు సర్వే చేశారు. గుర్తించిన పనులు సకాలంలో పూర్తిచేయాలి.

– భూక్యా తిరుపతినాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్, రాజారాం తండా

ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 38 గిరిజన తండాల్లో అధికారులతో వారంపాటు సర్వే చేయించాం. మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇచ్చాం. నివేదికను ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

– గంగారాం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, ఉమ్మడి కరీంనగర్

ఆగని అన్నదాతల నిరసనలు



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- మంచినీళ్ల బావి నుంచి జిల్లాకేంద్రం వరకు ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్: మాస్టర్‌ప్లాన్‌పై సమీప గ్రామాల ప్రజల నిరసనలు ఆగడంలేదు. మంగళవారం హస్నాబాద్, అంబారిపేట గ్రామాలకు చెందిన రైతులు మంచినీళ్ల బావి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ప్రకాశ్, సీఐలు కిశోర్, కృష్ణకుమార్, రమణమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు రెండు గంటల పాటు రైతులు ఆందోళన చేశారు.

అంబారిపేటలో మహిళల నిరసన..

జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామ మహిళలు పంచాయతీ కార్యాలయ భవనం ఎక్కి నిరసన తెలిపారు. మాస్టర్‌ప్లాన్ నుంచి తమ గ్రామాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్, మోతె, నర్సింగాపూర్, ధరూర్, లింగంపేట, హస్నాబాద్, అంబారిపేట గ్రామాల్లోనూ రైతు నాయకులు భవిష్యత్ కార్యాచరణపై సమావేశాలు నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ రద్దయ్యేంత వరకూ ఆందోళనలు విరమించేది లేదని తేల్చిచెబుతున్నారు.

రైతుల పక్షాన ఉంటాం..

రైతుల పక్షాన ఉంటూ మాస్టర్ ప్లాన్ రద్దు చేసే బాధ్యతను తీసుకుంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శంకులపల్లి, మోతె, నర్సింగాపూర్ రైతులు, మహిళలు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ రద్దుకు పూర్తి భరోసా తనదే అని ఆయన అన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

పట్టణానికే పరిమితం చేయాలి

మాస్టర్ ప్లాన్‌ను జగిత్యాల పట్టణానికే పరిమితం చేయాలని, రైతు హక్కులు, స్వేచ్ఛను హరించొద్దని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అంబారిపేట, హస్నాబాద్ గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు మద్దతు తెలిపారు. తక్షణమే మాస్టర్ ప్లాన్ జీవోను రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనే తమ ఊరు భూములు రైల్వేలైన్‌కు, ఎస్సారెస్పీ కాలువలకు పోయాయని, ఉన్నవాటిని మాస్టర్ ప్లాన్‌లో కోల్పోతే తమ బతుకులు ఏం కావాలని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులు లక్ష్మణ్‌రావు, గంగాధర్, ఉపసర్పంచ్ మల్లేశం పాల్గొన్నారు.

కారు నంబరు 3911..?

- ఏటీఎం దొంగలు ఉపయోగించిన వాహనం
- ఢిల్లీ పాసింగ్ కారుగా గుర్తింపు
- మహారాష్ట్రలో ఉన్నట్లు సమాచారం
- కర్ణాటక గ్యాంగ్‌పై సందేహాలు
- లోతుగా సాగుతున్న పోలీసుల దర్యాప్తు

కోరుట్ల: సంచలనం రేపిన కోరుట్ల ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసులో దొంగలు ఉపయోగించిన కారును పోలీసులు గుర్తించినట్లు సమాచారం. చోరీ సమయంలో ఓ కంపెనీకి చెందిన కారును పోలీసు జీపుతో ఢీకొట్టి నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగలు మాత్రం తప్పించుకుపోయారు. పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఐదు పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితులు చోరీకి తెగబడకముందు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కారులో తిరిగినట్లుగా తెలిసింది. ఈ క్రమంలోనే కార్గిల్ చౌరస్తా వద్ద 3911 నంబరు గల కారు అనుమానాస్పదంగా కనిపించింది. చివరకు అదే నంబరు కారులో ముష్కరులు ఏటీఎం చోరీకి వచ్చినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇది ఢిల్లీ పాసింగ్ కారుగా తెలిసింది. ఏటీఎం చోరీ చివరి నిముషంలో పోలీసుల నుంచి తప్పించుకున్న దొంగలు.. మెట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపో ఎదురుగా మల్లాపూర్ రూట్‌లో వెళ్లి గోధూర్, వర్షకొండ, ఇబ్రహీంపట్నం మీదుగా నాగ్‌పూర్ జాతీయ రహదారిపైకి వెళ్లి నిర్మల్ ఎదుట ఉన్న సోన్ వంతెన నుంచి ఆదిలాబాద్ చేరుకున్నట్లు సమాచారం. అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఏటీఎం చోరీకి పాల్పడ్డ అగంతకులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారుగా అనుమానిస్తున్నారు. కారు ఆచూకీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. శనివారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట ప్రాంతంలో ఏటీఎం చోరీ జరిగిన విషయం విదితమే.



సీసీ కెమెరాలో కనిపించిన కారు

పోలీసుల కళ్లుగప్పి వ్యాపారి పరార్

- గాలింపు చేపట్టిన ప్రత్యేక బృందాలు

జగిత్యాలక్రైమ్/సారంగాపూర్(జగిత్యాల): పలు వురి నుంచి పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేసిన ఓ వడ్డీ వ్యాపారి జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి పరారయ్యాడు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన వడ్డీ వ్యాపారీ రేగొండ నరేశ్ 2021 సెప్టెంబర్‌లో దాదాపు రూ.10 కోట్ల – రూ.20 కోట్ల వరకు పలువురు వద్ద అప్పు తీసుకున్నాడు. ఇందుకోసం అధిక వడ్డీ ఇస్తానని వారిని నమ్మించాడు. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి కనిపించకుండా పారిపోయాడు. దీంతో పలువురు బాధితులు వారం పాటు జిల్లాకేంద్రంలో ఆందోళన నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోచమ్మవాడకు చెందిన బాధితురాలు పిట్టల రజని 2 అక్టోబరు 2021న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నరేశ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు.. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టాయి. అయినా, నరేశ్ ఆచూకీ లభించలేదు. చివరకు సారంగాపూర్ మండలం అర్పపల్లి గ్రామానికి చెందిన బాధితుడు కిరణ్‌రెడ్డి.. హైదరాబాద్ దిల్‌షుక్‌నగర్‌లో నరేశ్‌ను ఇటీవల పట్టుకుని జగిత్యాల పోలీసులకు అప్పగించాడు. పోలీసులు విచారణ జరిపారు. నిందితుడి నుంచి సుమారు రెండు కిలోల బంగారం స్వాధీనం చెసుకున్నట్లు తెలిసింది. విచారణ పూర్తికావడంతో మంగళవారం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి జగిత్యాల కోర్టుకు హాజరుపరిచేందుకు తీసుకువచ్చే ప్రయత్నంలో నరేశ్ పోలీసుల కళ్లు కప్పి పారిపోయాడు. పోలీస్ ఉన్నతాధికారి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నరేశ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. నిందితుడి వద్ద మొబైల్‌ఫోన్ లేదు. దీంతో ప్రధాన రహదారుల వెంట పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. మరోవైపు.. నిందితుడు పారిపోయాడనే సమాచారంతో బాధితులు తమ సొమ్ము వస్తుందా, రాదా? అని ఆందోళన చెందుతున్నారు.



నిందితుడు నరేశ్

విద్యార్థులకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న డీఐవో నారాయణ

మల్లాపూర్(కోరుట్ల): ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చేలా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐవో) నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు శాతాన్ని పరిశీలించారు. మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ దశలోనే ఉన్నతమైన లక్ష్యాలకు అనుగుణంగా శ్రమించాలని, గమ్యం చేరేవరకూ పట్టుదలగా ముందుకు సాగాలని సూచించారు. చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఆల్ ఇండియా సివిల్స్ టాపర్, భద్రాది కొత్తగూడెం కలెక్టర్ అనుదీప్‌ను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభ కనబర్చాలని కోరారు. ప్రిన్సిపాల్ కాలిక్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న కలెక్టర్ రవి

జగిత్యాల: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రవి ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గ్రామీణ క్రీడా ప్రాంగణాల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. వైకుంఠధామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, బస్తీ దవాఖానాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, మన ఊరు.. మన బడి, ఈ – ఆఫీస్, కంటి వెలుగు కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగుకు సర్వం సిద్ధం

- పీహెచ్‌సీలకు చేరిన 41,996 కళ్లద్దాలు
- 19 నుంచి రెండోవిడతకు ఏర్పాట్లు
- 46 వైద్య బృందాల నియామకం

పెగడపల్లి(ధర్మపురి): జిల్లాలో రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 18న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఈనెల 19న మన జిల్లాలో ప్రారంభిస్తారు. ఇందుకు అవసరమైన సామగ్రి, కళ్లద్దాలు ఇప్పటికే అందుబాటులో ఉంచారు. అవసరమైన వైద్య బృందాలను నియమించారు. దృష్టిలోపంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి రూపకల్పన చేసింది. జిల్లాలో 9,85,417 జనాభా ఉంది. తొలివిడతలో 6,47,684 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలు ఉచితంగా ఇచ్చారు.

ఒక్కో ప్రాంతంలో వారం పాటు..

- రెండోవిడతలో నేత్ర పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.
- జిల్లాలోని 380 గ్రామ పంచాయతీల పరిధిలో 46 వైద్య బృందాలు ఏర్పాటు చేసింది.
- ఒక్కో బృందంలో ఒక వైద్యాధికారి, ఒక నేత్ర వైద్య నిపుణుడు, డాటా ఎంట్రీ ఆపరేటర్, పర్యవేక్షకుడు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తను నియమించారు.
- ఒక్కోప్రాంతంలో రెండురోజుల నుంచి వారం పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.
- తొలుత సిబ్బంది ద్వారా కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలను శిబిరాలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు.
- రోజూ ఉదయం 9– సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తారు.
- అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి నేత్ర సంబంధిత లోపాలు గుర్తిస్తారు.



పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

- బీపీ, మధుమేహంతో బాధపడేవారి కళ్లలో మార్పులనూ పరిశీలిస్తారు.
- దృష్టిలోపం ఉన్నవారికి అక్కడే కళ్లద్దాలు పంపిణీ చేస్తారు.
- ప్రత్యేకమైన అద్దాలు అవసరమున్న వారికి (ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్) ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తారు.
- రెండు వారాల్లో సదరు వ్యక్తి ఇంటికి నేరుగా వాటిని పంపిస్తారు.

ఐదు రకాల అద్దాలు సిద్ధం..

రెండోవిడతకు అవసరమైన కళ్లద్దాలు ప్రస్తుతం జిల్లాకు చేరుకున్నాయి. వీటిని ఆయా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించారు. జిల్లాకు తొలివిడతలో 41,660 కళ్లద్దాలు పంపిణీ అయ్యాయి. వీటిలో ఐదు రకాలు ఉన్నాయి. రెండో విడత కోసం 41,996 కళ్లద్దాలు అందుబాటులో ఉన్నాయి.

విజయవంతం చేస్తాం



జిల్లాలో చేపట్టే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజల భాస్వామ్యంతో విజయవంతం చేస్తాం. ఈ కార్యక్రమానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నాం. వైద్య పరీక్షలు చేయడానికి 46 వైద్య బృందాలను నియమించాం. విధులపై అవగాహన కల్పించాం. ఐదు రకాల అద్దాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

– శ్రీధర్, జిల్లా వైద్యాధికారి

క్లుప్తంగా

ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న హైకోర్టు జస్టిస్ కార్తీక్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బీరయ్య దేవాలయాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్ల కార్తీక్ మంగళవారం దర్శించుకున్నారు. జగిత్యాలకు చెందిన జస్టిక్ పుల్ల కార్తీక్.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ శాఖ ఉద్యోగులు, తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు రూపొందించిన 2023 డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ రవి మంగళవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.సురేశ్‌కుమార్, ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్ రాంచందర్, అధ్యక్షుడు తిరుపతినాయక్, కోశాధికారి చంద్రదీపక్, ఏడీఏ కల్పన పాల్గొన్నారు.

ఇసుకడంప్ స్వాధీనం

మల్లాపూర్(కోరుట్ల): రేగుంట శివారులో మంగళవారం రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఇసుక డంప్ స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ రవీందర్ తెలిపారు. గ్రామ శివారులో నిల్వ ఉంచిన సుమారు 20 ట్రిప్పుల ఇసుకను స్వాధీనంలోకి తీసుకున్నామని పేర్కొన్నారు. గోదావరినది, పెద్దవాగు తీరప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వాల్టా ప్రకారం కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆర్‌ఐలు విశ్వనాథ్, రాజేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి సాంకేతిక కోర్సుల పరీక్షలు

జగిత్యాల: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయ్యర్ గ్రేడ్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలు ఫిబ్రవరి 11 – 14వ తేదీ వరకు నిర్వహిస్తామని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. 11న టైలరింగ్, ఎంబ్రాయిడరీ (లోయర్ గ్రేడ్), 12–13న టైలరింగ్, ఎంబ్రాయిడరీ(హయ్యర్ గ్రేడ్), 11–14వ తేదీ వరకు డ్రాయింగ్ (లోయర్ గ్రేడ్), 11–14 వరకు డ్రాయింగ్ (హయ్యర్ గ్రేడ్) పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలు ఉదయం 10.00 – మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.00 – సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యేవారు **www.bse.telangana.gov.in** వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెద్దపల్లిరూరల్: కూనారం రోడ్డులో తాళం వేసి ఉన్న ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. వరంగల్‌కు చెందిన జి.అరుణ్‌కుమార్ అనే ఇంజినీర్ కొంతకాలంగా కూనారం రోడ్‌లో నివాసముంటున్నాడు. సంక్రాంతి పండగకు భార్యాభర్తలిద్దరూ సొంతూరుకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు ఇంట్లో చొరబడి తులంన్నర బంగారం, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం బాధితులు ఇంటికి రాగా దొంగతనం జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కౌన్సిల్ నిర్ణయంపైనే ఆశలు

- మాస్టర్ ప్లాన్ రద్దుచేయాల్సిందే..
- అలాగైతేనే ఆందోళనలు విరమిస్తాం
- హెచ్చరిస్తున్న వివిధ గ్రామాల రైతులు



బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల: ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై జిల్లాలో నిరసనలు ఇంకా అదుపులోకి రావడంలేదు. ఒక వైపు.. ప్రజలు సంక్రాంతి సంబురాలు ఘనంగా జరుపుకోవాల్సింది పోయి.. ఇళ్ల ఎదుట ముగ్గులు వేసి మాస్టర్ ప్లాన్‌పై నిరసన తెలిపారు. మాస్టర్ ప్లాన్ ఫ్లెక్సీలు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. రైతులకు చెందిన వేలాది ఎకరాల భూములను రిక్రియేషన్ జోన్‌లో చేర్చడాన్ని వారు నిరసిస్తూ ఆందోళన తీవ్రతరం చేస్తున్నారు. ఇంకోవైపు.. ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై అభ్యర్థనలు స్వీకరిస్తామని మున్సిపల్ అధికారులు ప్రకటించడంతో వారికి ఇప్పటికే సుమారు 3 వేలకు పైగా అభ్యంతరాలు వచ్చినట్లు తెలిసింది.

ముసాయిదాను రద్దు చేస్తేనే..

- ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలను సుమారు రెండు నెలల పాటు స్వీకరిస్తారు.
- అభ్యంతరాలు అధికంగా ఉంటే.. కౌన్సిల్ తీర్మానం చేసి ముసాయిదా రద్దు చేస్తామనే సాంకేతాలు వెలువడుతున్నా.. రైతుల్లో ఆందోళనలు తొలగిపోవడంలేదు.
- మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై డీటీసీపీ అధికారులు ఢిల్లీకి చెందిన ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీతో సమగ్ర సర్వే చేయించారని, ఇందులో తప్పిదం చోటుచేసుకుందని స్థానిక ఎమ్మెల్యే సంజయ్ పేర్కొనడం బాధితుల్లో కాస్త ఉపశమనం కలిగిస్తోంది.
- కానీ, పారిశ్రామిక, హరిత, రిక్రియేషన్ జోన్లలో రెండు పంటలు పండే భూములను చేర్చడంపైనే వారు ఆందోళన చెందుతున్నారు.
- ఈ జోన్లలోని భూముల్లో భవిష్యత్‌లో ఇళ్లు నిర్మించుకోవడం, భూములు విక్రయించడం సమస్యాత్మకంగా మారుతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.
- అంతేకాదు.. కొందరు రైతుల భూములు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయా గ్రామాల్లో రోజూ ఆందోళనలు జరుగుతున్నా మున్సిపల్ కౌన్సిల్ ఇప్పటివరకు సమావేశం కాలేదు.
- అధికారులు అభ్యంతరాలు స్వీకరిస్తామని చెబుతున్నారు.. కానీ, ముసాయిదాను రద్దు చేస్తామని ఎక్కడా ప్రస్తావించడంలేదు.

మున్సిపల్‌లో సర్వే నంబర్లు

లింగంపేట, మోతె, తిప్పన్నపేట, హస్నాబాద్, ధరూర్, అంబారిపేట, తిమ్మాపూర్, టీఆర్‌నగర్ గ్రామాల్లోని కొన్ని భూముల సర్వే నంబర్లను ఇటీవల మున్సిపల్ పరిధిలోకి తీసుకొచ్చారు. అయితే, 2041వ సంవత్సరంలో పట్టణ ప్రజల అవసరాలను గుర్తించిన మున్సిపల్ అధికారులు.. అందుకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఇందులో పట్టణంలోని అన్ని వార్డులతోపాటు సమీపంలోని గ్రామాలను విలీనం చేయడం వివాదాస్పదమైంది. ఏదిఏమైనా మున్సిపల్ కౌన్సిల్ సమావేశమై దీనిపై ఏదోఓ నిర్ణయం తీసుకుంటే తప్ప బాధితులు ఆందోళనలు విరమించేట్లు లేదని పరిశీలకులు భావిస్తున్నారు.

ఆదర్శ కాలనీ.. 'నందనవనం'



నందనవనం హౌసింగ్ సొసైటీలోని ప్లాట్లు

- ఐదెకరాల విస్తీర్ణం
- 70మందికి ప్లాట్లు
- రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- పోలీసు ఉద్యోగుల్లో ఆనందం

జగిత్యాలరూరల్: జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న హోంగార్డులు, కానిస్టేబుళ్లకు, అధికారుల కోసం ఎస్పీ సింధూశర్మ ఆదేశాలతో నందనవనం హౌసింగ్ సొసైటీ రిజిస్ట్రేషన్ చేశారు. పట్టణ సమీప వెల్దుర్తి శివారులో టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం దీనిని ఏర్పాటు చేశారు. 70 మందికి ఇందులో ప్లాట్లు కేటాయించారు. ప్రతీ ప్లాట్‌కు రోడ్డుతోపాటు డ్రైనేజీ నిర్మించారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఇళ్ల నిర్మాణం కోసం బ్యాంకుల నుంచి రుణాలు కూడా మంజూరు చేయించారు.

నిబంధనల ప్రకారం రోడ్లు..

- నందనవనం హౌసింగ్ సొసైటీలోని ప్రతీకాలనీలో 33 అడుగుల వెడల్పుతో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, ఆటస్థలం, ఉద్యానవనం నిర్మించారు.
- ఇవన్నీ డీటీసీపీ ప్లాన్ ప్రకారం ఏర్పాటు చేశారు.
- జిల్లాలోనే వందశాతం నిబంధనలు పాటించి ఏర్పాటు చేసిన నందనవనం హౌసింగ్ సొసైటీ ఇదే కావడం విశేషం.
- ఇందులో 55 ప్లాట్లు హోంగార్డులు, కానిస్టేబుళ్లకు అప్పగించారు.
- మిగతావి ఎస్సైలు, సీఐ స్థాయి అధికారులకు కేటాయించారు.

వందశాతం నిబంధనలతో హౌసింగ్ సొసైటీ

జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న జూనియర్ హోంగార్డులు, కానిస్టేబుళ్లు, పోలీసు అధికారులకు వందశాతం డీటీసీపీ ఆమోదం పొందిన ప్లాన్ ప్రకారం ప్లాట్లు ఏర్పాటు చేశాం. ఇందుకోసం వెల్దుర్తి శివారులో ఐదెకరాలు కొనుగోలు చేశాం.

– సింధూశర్మ, ఎస్పీ

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను గద్దె దించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): నిరుపేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌లను గద్దె దించేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీల నియామక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ హయాంలో పెట్రోల్, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరుపేదల సంక్షేమాన్ని విస్మరించారని, కేవలం పింఛన్లు, కల్యాణలక్ష్మీకి మాత్రమే నిధులు విడుదల చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాలు, రైతురుణమాఫీని పట్టించుకోవడంలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే బోర్నపల్లి వంతెన, ప్రతీ గ్రామంలో సీసీరోడ్లు నిర్మించామని గుర్తుచేశారు. ప్రస్తుతం రాయికల్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే అధికార పార్టీ ఏంచేస్తుందని ప్రశ్నించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్‌రెడ్డి, నాయకులు గన్నవరం ప్రభాకర్, మున్ను, వాసం దిలీప్, కట్కం మధు, భూమయ్య, ఆనంద్, పృథ్వీరాజ్, నర్సయ్య పాల్గొన్నారు.

రిజర్వేషన్లు వర్తింపజేయాలని వినతి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

జగిత్యాల: ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్‌ను ఉపాధ్యాయ పదోన్నతుల్లో వర్తింపజేసి ఎస్టీలకు న్యాయం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నునావత్ రాజు, నీలేటి ఎల్లయ్య కోరారు. సంఘం రూపొందించిన కొత్త సంవత్సరం క్యాలెండర్, డైరీలను హైదరాబాద్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరింపజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని మంత్రిని కోరారు. నాయకులు రాజేశ్వర్, రమేశ్‌నాయక్, రవి, రాజేశ్, దామోదర్, విజయ్, రాజేశ్, మల్లయ్య ఉన్నారు.

దళితులకు అండగా బీఆర్‌ఎస్

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



ఎమ్మెల్యే కల్వకుంట్ల అధ్వర్యంలో బీఆర్‌ఎస్ కండువా కప్పకుంటున్న కృష్ణప్రసాద్

కోరుట్ల: దళితులకు అండగా బీఆర్‌ఎస్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల కృష్ణప్రసాద్ ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కల్వకుంట్ల మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పటికే దళితబంధు పథకం కింద ఒక్కొక్కరికి రూ.10లక్షల సాయం చేసి ఆ కుటుంబం నిలదొక్కుకోవడానికి మద్దతుగా నిలిచిందని గుర్తుచేశారు. రానున్న కాలంలో పెద్దఎత్తున దళితబంధు అమలు అవుతుందని అన్నారు. మాల సంఘ భవనానికి ఇప్పటికే రూ.2 లక్షలు మంజూరు చేశామన్నారు. బస్టాండ్ వద్ద సంఘ భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సంజయ్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్‌లో కృష్ణప్రసాద్ చేరడం ఆశించదగ్గ పరిణామన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దఎత్తున వలసలు బీఆర్‌ఎస్‌లోకి సాగుతాయన్నారు. పట్టణ టీఆర్‌ఎస్ అధ్యక్షులు అన్నం అనిల్ మాట్లాడుతూ, కోరుట్ల సెగ్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల అందరికీ అందుబాటులో ఉండే నాయకుడన్నారు. ఎస్సీ సెల్ నాయకుడు పసుల కృష్ణప్రసాద్‌తోపాటు నాయకులు కండ్లె పెద్ద గంగారాం, కొంత లక్ష్మీ, దామ కొండయ్య, కండ్లె నరేశ్, పసుల రాంప్రసాద్, సుమారు 200 మంది మహిళలు, యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు గడ్డమీద పవన్, బలిజ రాజిరెడ్డి, మోర్తాడ్ లక్ష్మణ్, వుయ్యాల నర్సయ్య, వుయ్యాల శోభన్, పుప్పాల ప్రభాకర్, ఆడెపు మధు, ఎంబేరి నాగభూషణం, అన్వర్, పొట్ట సురేందర్, మ్యాకల మహేశ్, పొట్ట దేవదాసు పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయండి



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్, ఆయన వెంట అధికారులు

ధర్మపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ మకరంద్ కోరారు. పట్టణంలోని బ్రాహ్మణ సంఘం భవనంలో ఈనెల 19న కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభిస్తారు. ఇందుకోసం చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కంటి వెలుగుపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య పరీక్షల కోసం వచ్చేవారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, మేనేజర్ గంగాధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

జగిత్యాల: రెండో ఏఎన్‌ఎంలను బేషరతుగా రెగ్యులర్ చేయాలని, పనిభారం తగ్గించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ కోరారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 14ఏళ్లక్రితం కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎంపికయ్యామని, ప్రభుత్వం ఎప్పుడు తమను క్రమబద్ధీకరిస్తుందోనని అప్పటి నుంచి ఎదురు చూస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. సర్కారు తీరుకు నిరసనగా కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనబోమని ఇప్పటికే స్పష్టం చేశామని అన్నారు. ప్రభుత్వం వెంటనే జీవో నంబరు 16లో చేర్చి తమను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలో పడాల మమత, వసంత, గూడూరి జయప్రద, శైలజ, విజయలక్ష్మీ, మేరి, సుప్రియ, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కోరుట్లరూరల్: పైడిమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–1996లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఒకేచోట కలిశారు. అందుకు గ్రామంలోని శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణం వేదికైంది. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అంతా కలిసి విందు భోజనం చేశారు. రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. జగిత్యాల డీపీవో, జోగిన్‌పెల్లి గ్రామానికి చెందిన పల్లికొండ నరేశ్ అదే బ్యాచ్ విద్యార్థి కావడంతో ఆయన కూడా ఇందులో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సయ్య, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు జగదీశ్వర్, సత్యం, శ్రీనివాస్, హన్మండ్లు, ప్రవీణ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో..

సారంగాపూర్(జగిత్యాల):సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సారంగాపూర్ ఉన్నత పాఠశాలలో 2006లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాత జ్ఞాపకాలను, ప్రస్తుతం తాము ఏ పనుల్లో ఉన్నామన్న దానిపై, వారి కుటుంబాల పరిస్థితి తదితర విషయాలపై ఆత్మీయంగా పలకరించుకున్నారు.

ఫిదా.. ఫిలిగ్రీ!

- కరీంనగర్ నుంచి ప్రపంచస్థాయి గుర్తింపు
- నాడు ప్రధానికి, నేడు వివిధ రాష్ట్రాల సీఎంలకు బహూకరణ
- గతంలో వెంకయ్యనాయుడు, ఇవాంక ట్రంప్‌కు అందజేత







విద్యానగర్(కరీంనగర్): ఆత్మీయులు అతిథిగా వస్తే మదిని దోచేలా బహుమతి ఇవ్వాలని అనుకుంటాం. దాన్ని చూసినప్పుడల్లా బహుమతి ఇచ్చినవారే గుర్తుకువచ్చేలా ఉండాలని కోరుకుంటాం. ఇందులో ప్రత్యేక గుర్తింపు పొందింది కరీంనగర్ ఫిలిగ్రీ. 400ఏళ్ల క్రితమే కరీంనగర్‌లో ఆవిర్భవించిన ఈ కళ జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. కడార్ల పనయ్య అనేవ్యక్తి తొలిసారిగా కరీంనగర్‌లో ఫిలిగ్రీ కళ ద్వారా వెండి వస్తువులు తయారు చేసిన ట్లు సమాచారం. ఆయన తయారు చేసిన డ్రెస్సింగ్ సెట్‌ను నిజాం రాజు బ్రిటన్ రాణి ఎలిజబెత్‌కు బహుకరించినట్లు చరిత్ర చెబుతోంది. కాగా.. బుధవారం ఖమ్మంలో జరగనున్న బీఆర్‌ఎస్ సభలోనూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, కేరళ సీఎం పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ తదితర అతిథులకు కరీంనగర్ ఫిలిగ్రీ కళానైపుణ్యంతో తయారు చేసిన వెండి వీణలు బహుకరించనున్నారు.

ప్రధానికి బహుకరణ

మిషన్‌భగీరథ ప్రారంభోత్సవానికి రాష్ట్రానికి వచ్చిన ప్రధానిమోదీకి రాష్ట్ర ప్రభుత్వం 5కిలోల బరువు గల భారీ ఫిలిగ్రీ నెమలిని బహుకరించింది. ఉపరాష్ట్రపతిగా ఎన్నికై మొదటిసారి హైదరాబాద్ వచ్చిన వెంకయ్యనాయుడికు 2.5కిలోల బరువు గల కాకతీయ కళాతోరణాన్ని కానుకగా ఇచ్చారు. రాష్ట్రంలో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సుకు హాజరైనా అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌కు మార్తై ఇవాంకకు అప్పటి గవర్నర్ నరసింహన్ చేతులమీదుగా ఫిలిగ్రీ నెమలిని అందించారు.

ఇలా తయారు చేస్తారు

కావాల్సిన ఆకృతిని తయారు చేసేందుకు ముందుగా కొలతలు తీసుకుని డయాగ్రాం వేస్తారు. వెండితీగలను కావాల్సిన సైజుల్లో కత్తిరిస్తారు. కత్తిరించిన ముక్కలను ఫ్రేముల్లో అమర్చుతూ తుదిరూపం తీసుకొస్తారు. డయాగ్రాంలో కావాల్సిన ఆకృతిలో పేర్చిన వెండి తీగ ముక్కలను అతికిస్తారు. చిన్న వెండి ముక్కలు కావడంతో వాటిని పేర్చే క్రమంలో ఓపిక అన్నది చాల ముఖ్యమైనది. చిన్న ఆకృతి అయితే వారం నుంచి పది రోజులు పడుతుండగా.. పెద్ద ఆకృతి చేయడానికి నెల నుండి రెండు నెలల వరకు సమయం పడుతుంది.

కళాకారుల పరిస్థితి ఇదీ..

ఫిలిగ్రీ కళ ఉన్నా.. ఖరీదైనది కావడంతో ఈ రంగంలోని వారికి ఉపాధి కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో కేంద్ర హస్తకళల పోత్సాహకశాఖ ద్వారా ఎ.అశోక్ నేతృత్వంలో 2008లో కరీంనగర్‌లో సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ సొసైటీ(సిఫ్కా) ఏర్పడింది. సొసైటి ద్వారా ప్రస్తుతం 15మంది పని చేస్తుండగా.. 100మంది వరకు ఇంట్లో నుంచి ఉపాధి పొందుతున్నారు. రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు.

శిక్షణ.. ఉపాధి పొందుతున్నారు



28ఏళ్లుగా ఫిలిగ్రీ పనిచేస్తూ శిక్షణ ఇస్తున్నా. సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ సొసైటీ కోశాధికారిగా, గ్రాండ్ మాస్టార్‌గా ఉన్నా. ఇప్పటివరకు 35 మంది నా దగ్గర శిక్షణ పొందారు. ఫిలిగ్రీకళలో 2010 లో రాష్ట్ర అవార్డు వచ్చింది. 2015లో జాతీయ అవార్డు తీసుకున్నా.

– ఆకోజు వెంకటేశ్వర్లు,కోశాధికారి, సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ సొసైటీ

ఆదరణ ఉంది



పదిహేను సంవత్సరాల నుంచి సిఫ్క సొసైటీలో పనిచేస్తూ ఫిలిగ్రీ కళ ద్వారా ఉపాధి పొందుతున్నాను. మేము తయారు చేస్తున్న ఫిలిగ్రీ కళరూపాలకు మంచి ఆదరణ ఉంది.

– ఎర్రోజు గంగ జమున, ఫిలిగ్రీ కళాకారిణి